క్లుప్తంగా

తాతబ్బాయికి నివాళి



తాతబ్బాయి కుటుంబీకులతో ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : ఇటీవల అనారోగ్యంతో మరణించిన దేవవరం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇసంపల్లి తాతబ్బాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబీకులను పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు గురువారం పరామర్శించారు. వైఎస్సార్ కుటుంబానికి విధేయుడిగా పార్టీకి ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. తాతబ్బాయి కుటుంబానికి తమ అండదండలు ఉంటాయని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్ల నర్సింహమూర్తి, బీసీ సెల్ నాయకుడు శీరం నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈదుల్ అజహా

కోటవురట్ల: మండలంలో బక్రీద్ పర్వదినం సందర్భంగా మసీదుల వద్ద సందడి నెలకొంది. ముస్లిం కాలనీలోని మజీద్ ఉస్మాన్ ఘని, నవ జవాన్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో హజరత్ ఇబ్రహీం, హజరత్ ఇస్మాయిల్ త్యాగాలను స్మరించుకుంటూ ఈదుల్ అజహా వేడుకను వైభవంగా జరిపారు. హఫీజ్ అజ్మత్ నూరి నేతృత్వంలో ఈదుల్ అజహా నమాజ్ చేశారు. నమాజ్ అనంతరం పరస్పర శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

నిత్యాన్నదానం ప్రారంభం



తోటాడ భావనా రుషి ఆలయంలో నిత్యాన్నదానం ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని తోటాడ భావనా రుషి ఆలయంలో గురువారం నిత్యాన్నదాన(మధ్యాహ్నం) కార్యక్రమం ప్రారంభమైంది. దొడ్డి వీరన్న వంశీయుల ఆర్థిక సహకారంతో దీనికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమ సంధానకర్త పొలమరశెట్టి ప్రసాద్ బాబు కోరారు.

గురు పౌర్ణమికి ఏర్పాట్లు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో జూలై 3న నిర్వహించే గురు పౌర్ణమి ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పంచదార్ల పుణ్యక్షేత్రంలో సాయిబాబా సన్నిధిలో ప్రత్యేక పూజలు, అన్న సమారాధన చేయనున్నారు. దిమిలి మణికంఠ క్షేత్రంలో గురుపౌర్ణమి సందర్భంగా పూజలు, హారతి, భజనలతో పాటు అన్న సమారాధనకు సన్నాహాలు చేస్తున్నారు.

పూడిమడకలో ఘనంగా తిరుగు రథయాత్ర



తిరుగు రథయాత్రలో భక్తుల కోలాహలం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో జగన్నాథస్వామి తిరుగు రథయాత్ర గురువారం ఘనంగా జరిగింది. స్వామివారిని రథంపై ఊరేగించారు. నవ రాత్రులు స్వామివారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ పురవీధుల్లో ఊరేగిన స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు.

లలితా సహస్రనామ పారాయణ దీక్ష



లలితా సహస్రనామ పారాయణంలో మహిళలు

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన శారదా గణపతి రామాలయంలో గురువారం రాత్రి లలితా సహస్ర నామ పారాయణ మండల దీక్షను ప్రారంభించారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని చేపట్టిన దీక్ష 41 రోజుల పాటు నిత్యం సాగనుంది. ఈ సందర్భంగా ఆలయంలో కలశాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు.

తన్నో విష్ణుః ప్రచోదయాత్

- భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు



కొరుప్రోలులో ఏకాదశి పూజలందుకున్న సీతారామస్వామి



కైలాసపట్నం రాజగోపాలస్వామి ఆలయంలో ఏవో చంద్రశేఖర్, భక్తులు



మంగవరంలో స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

శ్రీ విష్ణవే చ విద్మహే..
వాసుదేవాయ ధీమహి..
తన్నో విష్ణుః ప్రచోదయాత్!!

శ్రీమహావిష్ణువును ధ్యానించనివ్వండి, ఓ వాసుదేవా నాకు సద్బుద్ధి ప్రసాదించు. విష్ణు భగవానుడు నా మనస్సును జ్ఞానంతో, కాంతితో ప్రకాశింపజేయుగాక.. అంటూ భక్తుల ప్రార్థనలతో ఆలయాలు మార్మోగాయి. ఆషాఢమాసంలో పౌర్ణమి ముందు వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. ఈరోజున శ్రీ మహావిష్ణువు యోగనిద్రలోకి వెళతాడని పురాణ ప్రతీతి. దీనిని శయన ఏకాదశి అని కూడా అంటారు. తొలి ఏకాదశి రోజున నిద్రపోయే స్వామివారు మళ్లీ నాలుగు నెలల తర్వాత కార్తీక శుద్ధ ఏకాదశి రోజు మేల్కొంటాడు. ఇంతటి పవిత్రమైన రోజు కాబట్టే భక్తులు ఆలయాలకు పోటెత్తారు.

పాయకరావుపేట : తొలిఏకాదశి సందర్భంగా గురువారం పట్టణంలో అతిపురాతన శ్రీరాధా రుక్మిణీ సహిత పాండురంగ స్వామి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.వెంకటాద్రి, అర్చకులు కృష్ణస్వామిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పట్టణంలోని రాజుగారిబీడు నందు వున్న శ్రీవరద వేంకటేశ్వర స్వామి ఆలయం, మంగవరం, రాజగోపాలపురం, పాల్తేరు గ్రామాల్లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో స్వామికి అభిషేకలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆయా దేవాలయాల్లో భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణ, ఏకాహం, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

కోటవురట్ల: మండలంలో తొలిఏకాదశిని గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలలో భక్తుల కోలాహలం నెలకొంది. కైలాసపట్నంలోని రాజగోపాలస్వామి, కోటవురట్లలోని శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి, చినలింగాపురంలో శ్రీ దుర్గామల్లేశ్వర అయ్యప్ప ఆలయాలలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. రాజగోపాల స్వామి ఆలయంలో ఏవో చంద్రశేఖర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం పూజల్లో పాల్గొన్నారు.

మునగపాక : మండల వ్యాప్తంగా ఏకాదశి పర్వదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మునగపాక, చూచుకొండ తదితర గ్రామాల్లోని రామాలయాలు కళకళలాడాయి.

రాంబిల్లి : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం తొలి ఏకాదశి పూజలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దిమిలిలో వల్లభ నారాయణస్వామి ఆలయంలో స్వామి పాదాల చెంత రైతులు ఖరీఫ్ సాగు కోసం సిద్ధం చేసిన విత్తనాలను ఉంచి పూజలు చేశారు. పలు ఆలయాల్లో భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎస్.రాయవరం : తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని మండలంలో గురువారం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొరుప్రోలు శ్రీ సీతారామస్వామి ఆలయంలో భక్తులు ఏకాహంతో సందడి చేశారు. ఎస్.రాయవరం శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి, దార్లపూడి శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లోనూ ఏకాదశి పూజలు జరిపారు.

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం అందలాపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని గురువారం దీపాలంకరణ, స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ మాట్లాడుతూ జూలై 1న శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



అందలాపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీపాలంకరణ



కొరుప్రోలు సీతారామాలయంలో ఏకాహం నిర్వహిస్తున్న భక్తులు



పాండురంగ ఆలయంలో విష్ణుసహస్ర నామ పారాయణం చేస్తున్న భక్తులు



చూచుకొండ రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ప్రతి కుటుంబానికీ సంక్షేమ లబ్ధి



కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : అమ్మా సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా, ఠంచనుగా అందుతున్నాయా.. ఏమైనా సమస్య ఉంటే చెప్పు తల్లీ.. వెంటనే పరిష్కరిస్తా.. అంటూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికీ వెళ్లి స్థానికుల ఆదరణ చూరగొంటున్నారు. మండలంలోని కైలాసపట్నంలో రెండో రోజు గడప గడపకు కార్యక్రమం గురువారం నిర్వహించారు. పార్టీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, సిద్దాబత్తుల నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో రాజగోపాలపురం, ఎస్సీ, వీవర్స్ కాలనీలలో ఎమ్మెల్యే పర్యటించి ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని కుటుంబాల వారీగా వివరించారు. వారిని అడిగి సమస్యలు తెలుసుకున్నారు. రాజగోపాలపురంలో జల్ జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లు అడ్డదిడ్డంగా వేశారని, కొన్ని చోట్ల రోడ్డు మధ్యలో నుంచి పైపు కనెక్షన్ ఇవ్వడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు. సీసీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని, ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఓ వీధిలో రోడ్డు వేయకుండానే ఉపాధి హామీ పథకంలో బిల్లులు చేయించేసుకున్నారని ఫిర్యాదు చేయడంతో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని దేశంలో ఎక్కడా లేని విధంగా నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏదైనా పని కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారని, ఇపుడా పరిస్థితి లేదన్నారు. కుల, మత, రాజకీయాలు చూడకుండా అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి, మాజీ జెడ్పీటీసీ వి.వెంకటలక్ష్మి, సర్పంచులు పెన్నాడ నూకరత్నం, పైల శివరామ్, బి.అనిల్ కుమార్, ఎంపీటీసీ ఎస్.రమణ, పార్టీ నాయకులు చామంతుల శ్రీనివాసు, శానాపతి రామునాయుడు, మేడిశెట్టి నానాజీ, తుమ్మలపల్లి ఆంజనేయులు, పెన్నాడ రాంబాబు, లాలం సన్యాసినాయుడు, చిటికెల రమణ, సురేష్, రమేష్, వి.నాగేశ్వరరావు, నీలేంద్రరావు, సోషల్ మీడియా కన్వీనర్ గోపాలకృష్ణ, కో కన్వీనర్ శ్రీనివాస్, తహసీల్దారు జానకమ్మ, ఏవో చంద్రశేఖర్, డీటీ సోమశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'సమస్యలను గుర్తించి నివేదిక సిద్ధం చేయండి'

కోటవురట్ల : జగనన్న సురక్ష కార్యక్రమంపై అలసత్వం వద్దని, సమస్యలు గుర్తించి నివేదిక తయారు చేయాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక సచివాలయాన్ని సందర్శించి జగనన్న సురక్ష కార్యక్రమ సర్వే వివరాలను తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తుకు ఇచ్చితంగా టోకెన్ జనరేట్ చేయాలన్నారు. సమస్య పరిష్కారానికి సంబంధించి ఆయా శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. జూలై 1 నుంచి శిబిరాలు ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సర్వే వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

బొడ్డేడకు శుభాకాంక్షల వెల్లువ

- పార్టీ బలోపేతం, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యమన్న ప్రసాద్



మంత్రి అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌లను సత్కరిస్తున్న స్థానిక నాయకులు

మునగపాక : వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రసాద్‌కు జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టడంతో పార్టీ శ్రేణుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. బుధవారం రాత్రి ప్రసాద్ తనకు జిల్లా పార్టీ అధ్యక్షునిగా అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజులను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అలాగే ప్రసాద్‌ను పలు ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. మునగపాక బొడ్డేడ క్యాంప్ కార్యాలయం కార్యకర్తలతో కళకళలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ప్రసాద్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పాటు పడతానన్నారు. అలాగే జిల్లా పరిధిలోని శాసన సభ్యులు, ఎంపీతో సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనకు జిల్లా అధ్యక్షునిగా అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి, ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. అచ్యుతాపురం మండల ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, పార్టీ మండల కన్వీనర్ దేశంశెట్టి శంకరరావు, జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు, పార్టీ నేతలు చిన్నారావు, మల్లవరం రాజుతో పాటు మునగపాక మండలం నుంచి పలువురు నాయకులు ప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకుంటున్న ముస్లిం సోదరులు



యలమంచిలి పట్టణంలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మసీదు వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

యలమంచిలి : పట్టణంలో బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో యలమంచిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్‌గఫూర్ మాట్లాడుతూ బక్రీద్ ఒక అపూర్వ పర్వదినం అని, ముస్లింల ఐక్యతకు, త్యాగానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందన్నారు. ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మండలంలోని రేగుపాలెం మసీదులో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ముస్లిం కాలనీలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో రెహమత్ యూత్ కమిటీ, జామియా మసీదు సభ్యులు, ముస్లిం యువకులు వల్లీ, తౌషిబ్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముస్లిం సోదరులు ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎస్.రాయవరం : త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండగను ముస్లిం గ్రామాలైన సీతారాంపురం, చెల్లాపురం గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పట్టణ ప్రాంతాల్లో స్థిరపడిన ముస్లిం సోదరులు స్వగ్రామాలు చేరుకుని బక్రీద్ వేడుకల్లో పాల్గొన్నారు.

నక్కపల్లి : బక్రీద్ సందర్భంగా మండలంలోని పెద బోదిగల్లం, చినబోదిగల్లం, రామకృష్ణాపురం, అప్పలపాయకరావుపేట, పెద దొడ్డిగల్లు గ్రామాల్లో ఉన్న మసీదుల వద్ద ముస్లిం సోదరులు గురువారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

విశాఖ, గాజువాక అనకాపల్లి తదితర ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన వారంతా స్వగ్రామాలకు చేరుకుని బక్రీద్ వేడుకల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, ఏపీయూఎఫ్‌ఐడీసీ డైరక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ గోసల కాసులమ్మలు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

నాడు పిచ్చిమొక్కల నిలయం.. నేడు ఆహ్లాదకరం



తిమ్మరాజుపేట శ్మశానవాటిక(నాడు)



అభివృద్ధి అనంతరం(నేడు)

రూ.9 లక్షలతో తిమ్మరాజుపేట శ్మశానవాటిక అభివృద్ధి

మునగపాక : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఒకవైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధి పనులు చకాచకా జరుగుతున్నాయి. మండలంలోని తిమ్మరాజుపేట శ్మశానవాటిక రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గత టీడీపీ హయాంలో పిచ్చిమొక్కలతో దర్శనమిచ్చిన ఈ శ్మశానవాటిక నేడు అంతిమ సంస్కారానికి అవసరమైన అన్ని వసతులతో ఆహ్లాదకరంగా మారింది. గ్రామాల అభివృద్ధిపై ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు ప్రత్యేక చర్యల నేపథ్యంలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శ్మశానవాటిక అభివృద్ధికి జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ రూ.5 లక్షలు, ఎంపీటీసీ శరగడం అప్పలనరసమ్మ రూ.2.50 లక్షలు తన కోటా నిధులు విడుదల చేశారు. దీంతోపాటు పంచాయతీ సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి పంచాయతీ నిధుల ద్వారా రూ.లక్షా 50 వేలు వెరసి రూ.9 లక్షలతో అభివృద్ధి చేశారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ పర్యవేక్షణలో పనులు శరవేగంగా పూర్తయ్యాయి.

డిప్యూటీ సీఎంను కలిసిన బొడ్డేడ



మునగపాక : ఉప ముఖ్యమంత్రి,పంచాయతీ రాజ్ శాఖామంత్రి బూడి ముత్యాలనాయుడును నూతనంగా నియమితులైన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముత్యాలనాయుడుకు దుశ్సాలువా కప్పి సత్కరించారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జిల నియామకం

నక్కపల్లి : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగు మండలాలకు జేసీఎస్ కన్వీనర్లను నియమించారు. నక్కపల్లి మండలానికి వియ్యపు శ్రీను, పాయకరావుపేట మండలానికి బొలిశెట్టి శ్రీను, కోటవురట్ల మండలానికి కిషోర్ నాయుడు, ఎస్‌రాయవరం మండలానికి దోసపాత్రుని సందీప్‌లను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. వీరంతా తమ మండల పరిధిలోని గ్రామాల్లో పర్యటించి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ జగనన్న సురక్ష కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించనున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లేలా కృషి చేయనున్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి) : యలమంచిలి నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జిలను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. అచ్యుతాపురం మండల జేసీఎస్ ఇన్‌చార్జిగా రాజాన విజయ్, మునగపాక ఇన్‌చార్జిగా పాలిమేర పూర్ణ చంద్ర గణేశ్, రాంబిల్లి ఇన్‌చార్జిగా కొవిరి రామకృష్ణ, యలమంచిలి మున్సిపాలిటీ ఇన్‌చార్జిగా కర్రి శివ శంకర్, యలమంచిలి మండల ఇన్‌చార్జిగా వీసం శ్రీనివాస్‌లను ప్రకటించింది.

రామన్నపాలెంలో 'గడప గడపకు' నేడు

కోటవురట్ల: మండలంలోని రాజుపేట సచివాలయ పరిధి రామన్నపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ ఎస్ సీతారామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు హాజరు కావాల్సిందిగాకోరారు.

వైభవంగా జగన్నాథుని ఉత్సవం



గూనలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

మునగపాక : మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో గురువారం శ్రీ జగన్నాథస్వామి ఉత్సవం ఘనంగా జరిగింది. మునగపాకలో ఉత్సవం నిర్వహించే కుటుంబాలు గూనలతో ఊరేగింపుగా సంతబయలకు చేరుకున్నాయి. దారి పొడవునా వీరికి స్థానికులు బిందెలు, బకెట్లతో నీరుపోసి ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం పిల్లలు, మహిళలు, పెద్ద ఎత్తున సంతబయల నూతి వద్దకు చేరుకుని స్నానమాచరించారు. అక్కడ గూనల్లో నీరు పట్టుకుని, తలపై పెట్టుకుని తిరుగు ముఖం పట్టారు. ఎవరిళ్లకు వారు చేరుకుని సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గూనలో పరమాన్నం వండి కుటుంబ సభ్యులతోపాటు ఇతర భక్తులకు పంచిపెట్టారు.

జగనన్న సురక్షపై అవగాహన



కొరుప్రోలులో జగనన్న సురక్ష సర్వే వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ఎస్.రాయవరం : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. జూలై 1 నుంచి ఈ కార్యక్రమంలో గ్రామ సభలు నిర్వహించనుండటంతో గ్రామాల్లో ముందుగా లబ్ధిదారులకు సమాచారం అందిస్తున్నారు. గురువారం బక్రీద్ సెలవు దినం అయినప్పటికి సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా అందిస్తామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.